# డంపింగ్ యార్డుకు నిలయం!



## మున్సిపల్ మైదానం..

- చిలకలగూడ మైదానంలో కానరాని అభివృద్ధి పనులు
- రూ. కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం
- ప్రజావసరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలంటున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**చిలకలగూడ:** బహుళ అంతస్తుల సముదాయం, మల్టీప్లెక్స్ , ఎగ్జిబిషన్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్, పచ్చందాలు ఏర్పాటు, ఓపెన్ జిమ్, ఇండోర్ స్టేడియం, విద్యార్థులకు క్రీడా సౌకర్యం ఇలా పలుమార్లు చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోగా, ప్రస్తుతానికి భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌యార్డుగా మారింది మెట్టుగూడ డివిజన్‌లోని చిలకలగూడ మున్సిపల్ మైదానం. సుమారు రూ.5 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ఇద్దరు డిప్యూటీలు శంకుస్థాపన చేసి దాదాపు రెండున్నరేళ్లు అవుతున్నా నేటికీ పనులు చేపట్టకపోవడం గమనార్హం. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం డంపింగ్ యార్డుగా మార్చడం వెనుక ఏదో మతలబు ఉందని స్థానికులు భావిస్తున్నారు.



వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)

### ఇదీ విషయం..

9800 చదరపు గజాల స్థలంలో ఐదు సెల్లార్లతో గ్రౌండ్ ఫ్లోర్‌లో 73 మడిగలు, ఫస్ట్ ఫ్లోర్‌లో 57 గదులతో 1982లో చిలకలగూడ మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్ ప్రారంభమైంది. నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరడంతో 2014 ఏప్రిల్‌లో భవన సముదాయాన్ని నేలమట్టం చేశారు. తొలుత బీఓటీ (బిల్ట్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ ) పద్ధతిలో మల్టీప్లెక్స్ నిర్మించాలని, అనంతరం పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో రూ.134 కోట్ల వ్యయంతో రెండు సెల్లార్లతో భారీ కాంప్లెక్స్ సముదాయం నిర్మించాలని రూపొందించిన ప్రతిపాదనలు బుట్టదాఖలాలయ్యాయి. అప్పటి నుంచి పలుమార్లు ప్రతిపాదనలు సిద్ధం చేయడం, కార్యరూపం దాల్చకపోవడం పరిపాటిగా మారింది.

### డంపింగ్ యార్డుపై వ్యతిరేకత..

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను చిలకలగూడ మైదానంలో డంపింగ్ చేసి అక్కడి నుంచి నగర శివారుల్లోని డంపింగ్ కేంద్రాలకు లారీల్లో తరలించేలా 2020 అక్టోబర్‌లో ప్రణాళికలు రూపొందించి నిర్మాణ పనులు ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీకి సిరులు కురిపించే కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని చెత్త డంపింగ్ యార్డుకు కేటాయించడం, జనావాసాల మధ్య ఏర్పాటు చేయడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోయారు. తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడంతో జీహెచ్‌ఎంసీతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు చెత్త డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకున్నారు.

### ఆ నిధులు ఏమయ్యాయి?

2021 జూన్ 26వ తేదిన అప్పటి డిప్యూటీ స్పీకర్ పద్మారావు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత రూ.4.40 లక్షల వ్యయంతో చిలకలగూడ మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. నేటికీ నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో కేటాయించిన నిధులు ఏమయ్యాయనే ప్రశ్న స్థానికుల్లో తలెత్తుతోంది.

### ప్రభుత్వ మార్పుతోనైనా..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో చిలకలగూడ మైదాన పరిస్థితి కూడా మారే అవకాశం ఉందని స్థానికుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభవన్ ప్రాంగణంలో ఇటీవల జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానికులు, విద్యావంతులు, క్రీడాకారులు చిలకలగూడ మైదానం పరిస్థితిని వివరిస్తు, అందరికీ ఆమోద్యయోగంగా తీర్చిదిద్దాలని వినతులు అందించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ సానుకూలంగా స్పందిస్తుందని వారు తెలిపారు. తక్షణమే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి చిలకలగూడ మున్సిపల్ మైదానాన్ని అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసి కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**సనత్‌నగర్:** బేగంపేట ప్రకాష్‌నగర్, సంజీవయ్యపార్కు, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. బేగంపేట ఎరుకలబస్తీ, మెజిస్టిక్ మాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్స్, ఆర్‌బీఐ లేన్ ఎదురు ప్రాంతం. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. వెర్మోంట్ అపార్ట్‌మెంట్స్, కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంక్, ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్ ప్రాంతాలు.

**కంటోన్మెంట్ పరిధిలో..**

**కంటోన్మెంట్:** విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా కంటోన్మెంట్ బోర్డు విద్యుత్ డివిజన్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు. ఆర్పీ నిలయం, అడ్డగుట్ట ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**కిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

**రాంగోపాల్‌పేట్:** కిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మైఫెయిర్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని మై ఫెయిర్ కాంప్లెక్స్, కేపీఆర్ ఫ్యామిలీ ట్రస్టు, భరణి కాంప్లెక్స్, సింధీకాలనీ, అశోక్ బిల్డర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు టీఎస్ కోప్లి, ఆటో ఫైనాన్స్, అన్నపూర్ణ హోటల్, డీసీపీ ఆఫీస్, భగారా, ఉషాకిరణ్ కాంప్లెక్స్, రాజ్ దాబా ప్రాంతాలు. బాపూబాగ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కృష్ణానగర్, సిద్ధివినాయక, పీజీరోడ్ ఫుడ్ వరల్డ్, పోచంపల్లి, సింధీకాలనీ, ఎయిర్‌లైన్ టవర్, పీజీ రోడ్, సయద్ అబ్దుల్లా. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీవీకాలనీ, జవహర్‌కాలనీ, గార్డెన్ , డీవీ హౌజ్, రామాలయం టెంపుల్, కిమ్స్ ఆస్పత్రి వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## కథనం చదివారు.. కానిస్టేబుల్‌ను నియమించారు



సిగ్నల్ పాయింట్ వద్ద విధుల్లో కానిస్టేబుల్

సాక్షి ఎఫెక్ట్..

**లాలాపేట:** లాలాపేట ఫ్లై ఓవర్ సిగ్నల్ వద్ద ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ఇష్టానుసారంగా రాకపోకలు సాగించడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించేది. ఈ సమస్యపై ఈ నెల 8న 'ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలి' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించారు. లాలాపేట సిగ్నల్ వద్ద ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి ఆటో యూనియన్ నాయకులు కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

## మేళాకు విశేష స్పందన



మేళాలో మాట్లాడుతున్న భాగ్య శ్రీ

**రసూల్‌పురా:** కళాత్మక వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్, గృహోపకరణాలు మొదలైన వాటితో మహిళా పారిశ్రామికవేత్తలు తిరుమలగిరి బంజారా కాలనీలో ఏర్పాటు చేసిన మేళాకు విశేష స్పందన వస్తోంది. కాలనీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన మేళాను ఆదివారం బోర్డు మాజీ సభ్యురాలు పి. భాగ్యశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతను ప్రతిబింబించేలా మహిళల ఆధ్వర్యంలో మేళా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి మేళాలను ఏర్పాటు చేయడం ద్వారా మహిళల్లో ఆత్మస్థైర్యం నింపుతుందన్నారు. ఈ సందర్భంగా మ్యూజికల్ చైర్, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యశోద, కాలనీ అధ్యక్షులు ఎండీ. అస్లాం, కార్యదర్శి వైవీ. రావు, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ధ్రువపత్రాల జారీలో అధికారుల తీరు సరికాదు



స్వామి

**లాలాపేట:** ధ్రువపత్రాల జారీలో మారేడుపల్లి మండల అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని వినోభానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా ఎస్సీ ధ్రువపత్రాల జారీలో అగ్రవర్ణాలకు చెందిన అధికారులు తీవ్రమైన వివక్షను చూపిస్తున్నారని ఎస్సీ సర్టిఫికెట్ల కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోతున్నారని అన్నారు. సంఘం సర్టిఫికేట్ అంటూ, రక్త సంబంధీకుల సర్టిఫికెట్ల జిరాక్స్ తేవాలంటూ అనేక కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు తార్నాక, లాలాపేట, శాంతినగర్ ప్రాంతాల నుంచి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు అన్ని అప్లికేషన్లను రిజెక్టు చేశారని వివరించారు. ఫలితంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో సంక్షేమ పథకాల కోసం చాలా మంది ఎస్సీలు దరఖాస్తులు సమర్పించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించకుంటే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## కొనసాగుతున్న పూజలు

**సనత్‌నగర్:** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగుతున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న కూడార్రై విశేష పాశురం, ప్రత్యేకంగా 108 గంగాళముల పాయసన్నముతో స్వామివారికి విశేష నైవేద్యం పూజ, 14న గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

## బైపాస్ రోడ్డు నిర్మాణం వృథా

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ క్యాంపస్‌లో బైపాస్ రోడ్డు వృథా అని టీఎస్‌పీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వలిగొండ నరసింహ పేర్కొన్నారు. రూ.16 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బైపాస్ రోడ్డు విద్యార్థులకు ఏవిధంగానూ ఉపయోగపడదన్నారు. గత ప్రభుత్వం కేవలం కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే రోడ్డు పనులను ప్రారంభించిందన్నారు. బైపాస్ పనులను రద్దు చేసి విద్యార్థులకు హాస్టల్ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

## మంత్రిని కలిసిన ఐఎన్‌టీయూసీ నేతలు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నేతలు

**లాలాపేట:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం సెక్రటేరియట్ లోని ఆయన కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ నాయకులు కలిశారు. త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టుల్లో తమకు సముచితమైన అవకాశాన్ని కల్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంటి కుమార్, రమావత్ నానూ నాయక్, భాస్కర్ ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘం



చీరలు, దుప్పట్లు, రెయిన్‌కోట్లు అందజేస్తున్న అన్నపూర్ణ

**సనత్‌నగర్:** ప్రజారోగ్య సంరక్షణ కోసం విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమని, వారిని గుర్తించడం అందరి బాధ్యత అని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీలో పనిచేసే జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, అపార్ట్‌మెంట్ల వాచ్‌మెన్ల భార్యలకు సోమవారం ఆమె ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు, రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. కాలనీలోని విజయ గ్రాండ్యూర్ అపార్ట్‌మెంట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది అందజేశారు. అన్నపూర్ణతో పాటు కాలనీకి చెందిన హైమావతి ప్రసాద్, హరిత, కృష్ణకుమారి, సుమ, విజయలక్ష్మీ దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ.. సమాజహిత కార్యక్రమాల నిర్వహణకు జెక్‌కాలనీ మహిళలు ఎప్పుడూ ముందుంటారన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి తగిన సహకారాన్ని అందించడం కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మల్లు ప్రసాద్, రాజశేఖర్, చందు, కాలనీ ప్రతినిధులు భాగ్యలత, సుప్రతి, స్వరూప, అమరావతి, వాణి, జ్యోతి, సింధు, శుభ పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెడ్సీ రవికిరణ్

**సికింద్రాబాద్:** జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కార మార్గం చూపుతున్నామని జోనల్ కమిషనర్ రవికిరణ్ పేర్కొన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి హాజరయ్యారు. జనన ధృవీకరణ పత్రాలలో సవరణలు, అక్రమ నిర్మాణాలు, పలు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు బేగంపేట, సికింద్రాబాద్, మల్కాజిగిరి జోన్‌ల నుంచి అందగా పలు ఫిర్యాదులకు అధికారులు సత్వర పరిష్కారం చూపారన్నారు. అనంతరం జోనల్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులకు సంబంధించి డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి జోనల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం ప్రభు, జీహెచ్‌ఎంసీ జోనల్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరం



మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

**సనత్‌నగర్:** డ్రైవింగ్ లైసెన్స్, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. టీటీఐ ఆధ్వర్యంలో బేగంపేటలోని బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో పనిచేసే సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అంశంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. వాహనదారులు ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకునేందుకు నెంబర్ ప్లేట్లను విరగ్గొట్టడం, దానికి మాస్కులు అడ్డం పెట్టడం చేస్తున్నారని, అలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో బజాజ్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్లు చంద్రశేఖర్, అమర్ ప్రేమ్, సూపర్‌వైజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి స్పందన కరువు

**సనత్‌నగర్:** జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ అధికారులు మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. బేగంపేట సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలను స్వీకరించేందుకు డిప్యూటీ కమిషనర్ శంకర్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రజల నుంచి ఒక్క అర్జీ కూడా రాకపోవడం గమనార్హం. అయితే ప్రజావాణి గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడం, క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం ఉద్దేశం ప్రజల్లోకి వెళ్లకపోవడంతోనే స్పందన కరువైనట్లు తెలుస్తోంది. ఒక్కరంటే ఒక్కరు కూడా సమస్యను విన్నవించుకునేందుకు రాకపోవడం బట్టి చూస్తే ఈ కార్యక్రమంపై అసలు ప్రజలకు అవగాహన ఉందా? అనేది ప్రశ్నార్థకం.



ప్రజావాణిలో అధికారులు

## నేడు మాస శివరాత్రి పూజలు

**సనత్‌నగర్:** మార్గశిర మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు రుద్ర హోమం, సాయంత్రం 6.30 గంటల (ప్రదోష కాలం) సమయంలో అభిషేకం, ప్రత్యేక అలంకార దర్శనం ఉంటాయని పేర్కొన్నారు.

## ఏబీవీపీ నాయకుల ధర్నా

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ ఆర్ట్స్ కాలేజీ పీజీ విద్యార్థుల సమస్యలు, హాస్టళ్లలో నెలకొన్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. 10 నెలల మెస్‌బిల్లు, ఎస్‌ఎస్‌పీ, ఈ–పాస్, బోనఫైడ్ ఫీజును రూ.100 నుంచి రూ.10కి తగ్గించాలని, క్లాస్ టైమ్‌కు అనుకూలంగా బస్ సౌకర్యం, నాణ్యమైన భోజనం అందించాలనే తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రిన్సిపల్ ప్రొ.గణేష్‌కు అందజేశారు.

## ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యమివ్వాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వ పథకాలతో పాటు ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం 2009 నుంచి 2024 వరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి కంచర్ల భద్రీ అధ్యక్షత వహించగా పిడమర్తి రవి, కోట శ్రీనివాస్‌గౌడ్, ఆజాద్, ద్యావ్రిక స్వప్న, తల్లమల్ల శ్వేత, కరుణ, సునీల్ శెట్టి, జంజర్ల రమేష్, మేడి రమణ, సంగమేశ్వర్. నర్సింహరావు, సురేష్, వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొని ప్రసంగించారు.

## వికసిత్ భారత్ సంకల్పయాత్రకు స్పందన

**లాలాపేట:** తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆయుష్మాన్ భారత్, ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్, ఆధార్ అప్డేట్ వంటి పలు సంక్షేమ పథకాల స్టాళ్లను ఏర్పాటు చేయగా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

## నడిరోడ్డులో కారు దగ్ధం

**సనత్‌నగర్:** నడిరోడ్డుపై ఓ కారుకు మంటలంటుకుని దగ్ధమైంది. కారు నడుపుతున్న వ్యక్తి అప్రమత్తమై కిందకు దిగడంతో ప్రాణాపాయం జరగలేదు. బేగంపేట పాటిగడ్డకు చెందిన రషీద్ తన ఓమ్నీ కారులో గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బేగంపేట విమానాశ్రయం వైపు వెళ్తుండగా ప్రకాష్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలోకి రాగానే ఇంజన్ నుంచి పొగలు రావడం గమనించి వెంటనే కారులో నుంచి కిందకు దిగాడు. ఆ వెనువెంటనే మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్ సమాచారం ఇవ్వగా ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపుచేశారు.

## అట్టహాసంగా ఆరాధనోత్సవాలు



దేవాలయంలో పలు సంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

**పద్మారావునగర్:** సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో సుప్రసిద్ధమైన స్కందగిరి దేవాలయంలో సోమవారం చంద్రశేఖరేంద్రసరస్వతీ ఆరాధనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగర నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ఇక్కడ ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా దేవాలయంలో వేదా పారాయణం, త్యాగరాజ పంచరత్న కృతులతో పాటు అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఐఏఎస్(రిటైర్డ్) ఎల్వీ సుబ్రహ్మణ్యం, స్కందగిరి దేవాలయం మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, కార్యా నిర్వాహణ అధికారి చల్లా విశ్వనాథశాస్త్రీ పాల్గొన్నారు.

## అక్రమ పార్కింగ్ తొలగింపు



**గాంధీఆస్పత్రి :** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదుట రహదారిపై పార్కింగ్ చేసి న వాహనాలను చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. రహదారికి అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆస్పత్రికి రాకపోకలు సాగించే అంబులెన్స్‌లు, వైద్యులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అక్రమ పార్కింగ్‌పై అందిన ఫిర్యాదుల మేరకు చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి పార్కింగ్ చేసిన ఆటోలు, ఇతర వాహనాలకు చలాన్లు విధించి అక్కడి నుంచి తొలగించి, నో పార్కింగ్ బోర్డులు, కోన్‌లు ఏర్పాటు చేశారు. అక్రమ పార్కింగ్ తొలగింపుతో ఆస్పత్రికి రాకపోకలు సాగించే అంబులెన్స్ డ్రైవర్లు, గాంధీ వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఐ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో, బస్సు డ్రైవర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీహెచ్.శ్రీనివాసులు

**సికింద్రాబాద్:** చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం బస్సు, ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఒలిఫెంట వంతెన నుంచి తార్నాక వైపు, గాంధీ ఆసుపత్రి మీదుగా ముషీరాబాద్ నడిచే బస్సు డ్రైవర్లకు చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు నేతృత్వంలో అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడుపడం, నిర్దేశిత బస్టాప్‌లు, పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలుపడం, మద్యానికి దూరంగా ఉండటం వంటి అంశాల పట్ల అవగాహన కల్పించారు. అదే విధంగా ఆటోలు నిలుపకుండా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. ప్రమాదాలు నివారించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు తెలిపారు.

## మెరుగైన వైద్యానికి కృషి



ఎమ్మెల్యేను కలిసిన డాక్టర్ సక్కుబాయి

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చెప్పారు. సోమవారం సికింద్రాబాద్ ప్రాంత వైద్యారోగ్య అధికారి డాక్టర్ సక్కుబాయి నేతృత్వంలో నియోజకవర్గంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎమ్మెల్యేను కలువగా వారితో ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సీతాఫల్‌మండిలోని కుట్టివెల్లోడి ఆసుపత్రిని అధునాతన ఆసుపత్రిగా తీర్చిదిద్దే పనులు ప్రారంభమయ్యాయని అడ్డగుట్ట, లాలాపేటలో అదనపు భవన సముదాయాల కోసం నిధులు మంజూరు చేయించామన్నారు. వైద్యులు, సిబ్బంది ఈ ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.

## వంట సామగ్రి వితరణ



**రసూల్‌పురా:** రసూల్‌పురా ఉషా గోడౌన్స్ వద్ద అమావాస్య సందర్భంగా ప్రతి నెల అన్నదానం నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ అసోసియేషన్, ఇందిరమ్మనగర్‌లో పోచమ్మ టెంపుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి రూ.2 లక్షల విలువ చేసే వంట సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించే వారికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు.రాజు, శాంతమ్మ, సాయి, శ్రీను, ప్రతాప్ రెడ్డి, విష్ణురెడ్డి, నర్సింహారెడ్డి, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



మహేష్ (ఫైల్)

**బన్సీలాల్‌పేట్:** అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ కావ్య కథనం ప్రకారం..కవాడిగూడ పతంగ్ బిల్డింగ్ సమీపంలోని నివసించే మహేష్(29) అప్పుల కారణంగా తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**రైలుకింద పడి..**

**సికింద్రాబాద్:** ఆర్థిక ఇబ్బందులు భరించలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యాదాద్రి జిల్లా వడపల్లికి చెందిన ఎలిమినేటి సాయినాథ్‌రెడ్డి (29) ప్రైవేటు ఉద్యోగి. సాయినాథ్‌రెడ్డికి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. చర్లపల్లి–ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్యగల ట్రాక్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

## ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**సికింద్రాబాద్:** ఫిట్స్ రావడంతో గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందాడు. రైల్వేస్టేషన్ 6వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై సుమారు 35 సంవత్సరాల ఉన్న ఓ ప్రయాణికుడు ఫిట్స్ రావడంతో కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా గంటలపాటు చికిత్స పొంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఎడమ చేతిపై అక్షిత అని పచ్చబొట్టుతో రాసి ఉందని, ఒంటిపై నల్లని పూల చుక్కలు కలిగిన తెల్లచొక్కా, నీలిరంగు జీన్స్ ప్యాంటు ఉందని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379